ఏలూరు కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యం

- కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్న పలు ప్రాంతాలు
- తాము ప్రాతినిధ్యం వహిస్తున్న 50వ డివిజన్‌కే పెద్ద పీట
- ప్రశ్నిస్తే అంతా మాయిష్టం అనే సమాధానం



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పనితీరు పాలకుల ఇష్టారాజ్యంగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు నగర వ్యాప్తంగా ఉన్న 50 డివిజన్లలో అనేక సమస్యలు తిష్ట వేసినా పాలకుల దృష్టికి రావడం లేదు. పాలక వర్గ పదవీకాలం మరో ఏడాది ఉండటంతో దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెతను అక్షర సత్యం చేస్తున్నారు. ఇటీవల కార్పొరేషన్ అజెండాలో పొందుపర్చిన ప్రత్యామ్నాయ పనుల్లో 80 శాతం పనులను నేరుగా మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 50వ డివిజన్‌కే కేటాయించడం అందునా మేయర్ భర్త, కో–ఆప్షన్ సభ్యుడైన వ్యక్తి గతంలో వేసిన ఎస్ఎంఆర్ నగర్‌కే కేటాయించడం పట్ల పలువురు కార్పొరేటర్లు చెవులు కొరుక్కుంటున్నారు. ఎవరేమనుకుంటే మాకేంటి అధికారం మాది, నిధులూ మావే అనే విధంగా సదరు పాలకులు తమ ఇష్టాను రీతిని పనులు కేటాయించుకుని ముందుకు సాగడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు రద్దు

2020–21 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.30 కోట్లతో ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో నాలుగు పనులు చేపట్టారు. వీటిలో ప్రధానంగా మూడు జీటీఎస్ (గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్స్) ఉన్నాయి. ఇవి నేటికీ పూర్తి కాలేదనే ఉద్దేశ్యంతో నిధులు వెనక్కి పోకూడదనే సదాశయంతో పాలకులు గతంలో ఆమోదించిన పనులను రద్దు చేస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. వీటి స్థానంలో మరో 5 ప్రత్యామ్నాయ పనులను ప్రవేశ పెట్టారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా ప్రత్యామ్నాయ పనుల్లో నాలుగు వర్కులు 50వ డివిజన్ ఎస్ఎంఆర్ నగర్‌లో (మేయర్ నివాస ప్రాంతంలో)నే పెట్టడం విశేషం.

ప్రత్యామ్నాయ పనుల వివరాలివీ..

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.30 కోట్లతో చేపట్టిన పనులను ఇప్పటి వరకు ఎంత ఖర్చు చేశారో అంత వరకు పనులు నిలుపుదల చేశారు. దీంతో మొత్తం నిధుల్లో రూ.1.64 కోట్ల మేర మిగులు నిధులు లెక్క తేల్చారు. ఈ నిధులు రూ.1.09 కోట్లతో కొత్తగా ఐదు ప్రత్యామ్నాయపనులను ప్రతిపాదించారు. వీటిలో రూ.71.99 లక్షలతో 50వ డివిజన్ పరిధిలోని ఎస్ఎంఆర్ నగర్‌లోనే నాలుగు పనులు ప్రతిపాదించారు. మరో పనిని 27వ డివిజన్‌లో 37.81 లక్షలతో చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో మిగిలిన మరో రూ.56.52 లక్షలతో 9ఎస్‌డబ్ల్యూఎం ట్రాక్టర్ల కొనుగోలుకు ప్రతిపాదించారు. దీనిలో కొసమెరుపుగా ఇవి ప్రతిపాదనలు మాత్రమేనని ప్రభుత్వ ఆమోదానికి పంపిన తరువాత ఆమోదం వచ్చాకనే పనులు ప్రారంభిస్తామని తెలివిగా నోట్ పెట్టడం విశేషం.

ఇష్టారాజ్యంగా చేసుకుపోతున్నారు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో కూటమి సర్కారుకు చెందిన పాలకులు అంతా తమ ఇష్టారాజ్యంగానే చేసుకుపోతున్నారు. ప్రశ్నించే వారు లేకపోవడం, ఒక వేళ ప్రశ్నించే ప్రయత్నం చేసినా అధికారం మాది, అంతా మా ఇష్ట ప్రకారమే చేస్తాం అంటూ సమాధానం ఇస్తున్నారు. దీంతో కౌన్సిల్ సమావేశాలు సైతం అధికార పార్టీ నాయకుల అభీష్టం మేరకు ఏక పక్షంగానే సాగిపోతున్నాయి.

పనులన్నీ ఒకే ప్రాంతంలో పెట్టడం దారుణం



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే పనులను ఒకే చోట గంపగుత్తగా పెట్టడం దారుణం. ఏలూరు నగరంలోని 50 డివిజన్ల పరిధిలో 80కి పైగా మురికి వాడలు ఉన్నాయి. వాటి అభివృద్ధి కోసం నిధులు ఖర్చుచేయాలి. పలు చోట్లు రోడ్లు, డ్రెయిన్లు అధ్వానంగా ఉన్నాయి. వీటి కోసం నిధులను వెచ్చించాల్సిన అవసరం ఉంది.

–డీఎన్‌వీడీ ప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

అన్ని ప్రాంతాలకూ నిధులను కేటాయించాలి



నగరంలోని 50 డివిజన్ల పరిధిలో మౌలిక వసతుల కల్పనకు నిధులను ఖర్చు చేయాలి. అంతేగాని తమకిష్టం వచ్చినట్లు తమ సొంత డివిజన్‌కే నిధులు కేటాయించుకోవడం సరైన పద్ధతి కాదు. ప్రజా ప్రతినిధులు ప్రజలందరినీ సమాన దృష్టితోనే చూడాలి. నచ్చిన చోట ఎక్కువగాను, నచ్చని చోట తక్కువగాను నిధులు వెచ్చించడం సరైనది కాదు.

–బండి వెంకటేశ్వరరావు, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు

క్లుప్తంగా

నేటి నుంచి ఇంటర్ కళాశాలలు ప్రారంభం


ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఉంగుటూరు: ఇంటర్మీడియెట్‌లో చేరే విద్యార్థులు ఈనెల 7వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చునని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరం తరగతులకు యథావిధిగా మంగళవారం నుంచి హాజరుకావాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ తదితర కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఈనెల 1 నుంచి 23 వరకు బ్రిడ్జికోర్సు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

పాటెమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం


అమ్మవారి ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాస్

దెందులూరు: నియోజకవర్గంలో సంతాన లక్ష్మిగా పేరుపొందిన పెరుగుగూడెం గ్రామదేవత శ్రీ పాటెమ్మ పేరంటాలమ్మ అమ్మవారి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెరుగుగూడెం, చల్లచింతలపూడి, తిమ్మన్నగూడెం గ్రామాల మధ్య వెలసిన అమ్మవారి ఉత్సవాలను ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాస్ ప్రారంభించారు. అమ్మవారు యలమర్తి వారి ఆడపడుచు కావడంతో పెరుగుగూడెం గ్రామం నుంచి 108 మంది ముత్తయిదువులు కళాశాలతో పాటెమ్మ ఆలయం వద్దకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీపాటెమ్మకు జలాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ శ్రీనివాస్, హేమలత దంపతులు, పావులూరి దశరథ రామయ్య, అనూష దంపతులు, పర్వతనేని ప్రభాకర్ గంగా వరలక్ష్మి దంపతులు, ఆలయ డైరెక్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ నెల 3వ తేదీన శ్రీ పాటెమ్మ దేవస్థానం ఆవరణలో నిప్పుల గుండం, 4వ తేదీన అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

2, 3 తేదీల్లో లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

దెందులూరు: దెందులూరు మండలంలో స్వయం ఉపాధి పథకం కింద వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈనెల 2, 3 తేదీల్లో ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే శ్రీదేవి తెలిపారు. దరఖాస్తు చేసిన లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

రేషన్ ఈ కేవైసీ నమోదు గడువు పెంపు

దెందులూరు: రేషన్ ఈ కేవైసీ నమోదు గడువు ఈ నెల 10వతేదీ వరకు పెంచినట్లు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రేషన్ ఈ కేవైసీ నమోదు గడువుపెంచిన సమాచారాన్ని ప్రతి కుటుంబానికి తెలియజేసేలా రెవెన్యూ సిబ్బంది కృషిచేయాలన్నారు. పెంచిన గడువు సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

టీడీపీ నేతలకు దళితులంటే చులకన

కామవరపుకోట: తెలుగుదేశం పార్టీ నాయకులు మొదట నుంచి దళితులను చులకన భావంతోనే చూస్తారని జలపవారిగూడెం గ్రామానికి చెందిన దళిత నాయకులు కరుటూరి బాలస్వామి, కరుటూరి మిధున్ చక్రవర్తి, మరికొందరు దళిత నాయకులు సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో దళితులకు సరైన మనుగడ, గుర్తింపు ఉండదని, ఎన్నికల సమయంలో వాడుకుని అధికారంలోకి వచ్చాక వదిలేస్తారని, దళితులను జెండా మోసే కూలీలుగానే గుర్తిస్తారు తప్ప వారికి ఆ పార్టీలో సరైన గౌరవం లభించదని వాపోయారు. అందుకనే టీడీపీలో ఇమడలేక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసి ఇటీవల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని కేంద్ర పార్టీ కార్యాలయం తాడేపల్లిలో కలిసి, ఆయన ఎదుట తమ గోడును వెల్లబుచ్చినట్లు వారు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ లింగమార్పిడి దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోణంగి రోడ్డులోని వైఎస్ఆర్ కాలనీలో సోమవారం అంతర్జాతీయ లింగమార్పిడి దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహాయ కౌన్సెలర్, న్యాయవాది వెంకట్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల హక్కులను గురించి తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు సింగిల్ రేషన్ కార్డులు, హిజ్రా సర్టిఫికెట్లు, ఇళ్ల స్థలాలు వచ్చే అవకాశాలపై వివరించారు. హిజ్రాలకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఆర్‌హెచ్ఈడీఎస్ సంస్థ ట్రాన్స్‌జెండర్స్ డే స్థాఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీష పాల్గొన్నారు.

ఉంగుటూరు తహసీల్దార్‌గా రవికుమార్

ఉంగుటూరు: తహసీల్దార్‌గా అమరావతి సెక్రటరీయేట్‌లో పని చేస్తున్న పాలపర్తి రవికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన డీటీ పూర్ణచంద్రప్రసాద్ నూతన తహసీల్దార్ రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించనున్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలయ్యేనా?

- డీఎస్సీ ఎప్పుడు.. నెరవేరని తొలి సంతకం
- నిరుద్యోగ భృతి హుళక్కేనా?
- 10 నెలలకే జనంలో పెరిగిన అసంతృప్తి
- మోసపూరిత హామీలతో మోసగించిన కూటమి నాయకులు



ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రచారం చేసిన సూపర్ సిక్స్

దెందులూరు: కూటమి నాయకులు ఎన్నికల ముందు నిరుద్యోగ భృతిపై విస్తృత ప్రచారం చేశారు. అధికారం చేపట్టి పది నెలలు అవుతున్నా వాటి ఊసెత్తని కూటమి ప్రభుత్వం.పథకాల అమలుపై రాని విధివిధానాలతో నియోజకవర్గంలో 22 వేల మందికి పైగా నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు నిరుద్యోగ భృతిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అధికారం చేపట్టిన వెంటనే ఈ పథకం అమలు చేస్తామని, అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేలు వస్తామని ఇంటింటికీ వెళ్లి ఓట్లు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి ఊసే లేదు. బడ్జెట్‌లో కూడా ఈ పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో నిరుద్యోగులు మండి పడుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అమలు చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

నెరవేర్చని తొలి సంతకం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజున మొదటి సంతకం చేసిన డీఎస్సీకే ఇప్పటి వరకూ దిక్కు లేదని నిరుద్యోగులు అంటున్నారు. నియోజకవర్గంలో 2 వేలకు పైగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. తొలి సంతకాన్ని నమ్మి పలు కోచింగ్ సెంటర్లలో చేరి శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం టెట్‌తోనే సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా వాయిదాలు వేస్తోంది. ఇతర ఉద్యోగాలు భర్తీకి కూడా కూటమి సర్కారు స్పష్టమైన ప్రకటన చేయలేదు. గ్రూపు–2 పరీక్షలు నిర్వహించినా ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారో, ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారో దేవుడికే ఎరుక. ఎన్నికల హామీ మేరకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని నియోజకవర్గంలోని 22 వేల మందికి పైగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలి

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించారు. ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా నిరుద్యోగులకు కల్పించలేదు. డీఎస్సీ అన్నారు అదీ లేదు. మరో వైపు పలు శాఖల్లో ఖాళీలు అధికంగా ఉన్నాయి. భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం లేదు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగం టార్గెట్‌గా పెట్టుకున్నాను. అనుకున్న విధంగా ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్లు రాకపోవడంతో నిరాశగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇస్తుందని ఎదురు చూస్తున్నాను. ఈ పథకం కోసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

–దేవదాసు ప్రేమ్‌కుమార్, నిరుద్యోగి

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. కనీసం ఈ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇప్పటికీ ప్రకటించలేదు. ఓట్లు దండుకోవడానికే హామీలు ఇచ్చారు. నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2014లో చేసినట్లే మళ్లీ మోసం చేస్తామనుకుంటే నిరుద్యోగులు ఈ ప్రభుత్వంపై తిరగబడే అవకాశం ఉంది.

–జులకంటి జాన్‌ప్రకాష్, నిరుద్యోగి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	08–10
బెండకాయలు	28	కంద	76
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	30
కాకర కాయలు	30–38	కీరా దోస	36
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	44	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	20–25	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	04
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	28
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02
~~ఏలూరు – తిరుపతి(ఇంద్ర)~~	~~19.00~~	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	04
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	10
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	04
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	11
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు –తిరుపతి	16.00	4830	32

మలేరియా జ్వరాలపై ఇంటింటి సర్వే


రామనర్సాపురంలో జ్వరాల నివారణకు రక్త నమూనాలు సేకరిస్తున్నవైద్య సిబ్బంది

బుట్టాయగూడెం: మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వి. పెద్దిరాజు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల శివారు గ్రామమైన రామనర్సాపురంలో ఒక మలేరియా కేసు నమోదైందని చెప్పారు. దీనితో ఆ గ్రామంలో ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేసినట్లు చెప్పారు. అలాగే మలేరియా నమోదైన ఇంటి నుంచి 50 ఇళ్ల వరకూ మలాథియాన్ స్ప్రేయింగ్ పనులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే దోమ కాటు నుంచి రక్షించుకోవడానికి తప్పనిసరిగా దోమతెరలను వినియోగించుకోవాలన్నారు. ఎంపీహెచ్ఓ పందిరి శ్రీను, ఎస్.శ్రీను, ఎంపీహెచ్ఏ బాలాజీ, రమేష్, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, పాల్గొన్నారు.

దాతృత్వానికి, కరుణకు ప్రతీక రంజాన్

- భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు
- ఆత్మీయ ఆలింగనాలతో పరస్పర శుభాకాంక్షలు


ప్రార్థనలు నిర్వహిస్తున్న గేట్ మసీద్ ఇమామ్


కర్బలా మైదానంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు విశేష ప్రార్థనలు నిర్వహించి దివ్య ఖురాన్ బోధనలు వినిపించారు. సర్వమత సమానత్వం పాటించాలని, మనుషులు అంతా ఒక్కటే అనే నినాదాన్ని విశ్వవ్యాప్తం చేయాలని చెప్పారు. స్థానిక వంగాయగూడెం రోడ్డులోని ఈద్గాహ్ ప్రాంగణంలో ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ ప్రత్యేక నమాజు ప్రార్థనలు నిర్వహించి అల్లాహ్ బోధనలు ముస్లింలకు శిరోధార్యమన్నారు. రంజాన్ పండుగ మత సామరస్యానికి, దాతృత్వానికి, కరుణకు ప్రతీక అన్నారు. సమాజంలో ఇతరులతో ఐక్యతగా మెలగడం, పేదలకు తోడ్పడడం, చెడు భావనలను, అధర్మాన్ని వీడాలని దివ్య ఖురాన్ బోధిస్తోందన్నారు. అలాగే స్థానిక పాత బస్టాండు వద్ద ఉన్న కర్బలా మైదానంలో నగరానికి చెందిన అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంజుమన్ సంస్థ ప్రతినిధులు ఎండీ సులేమాన్, అస్లాం షరీఫ్, రాజా అహ్మద్, ఎండీ ఎగ్బాల్, ఎండీ అజ్మల్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల ప్రత్యేక ప్రార్థనలు

నగరంలోని లక్ష్మీవారపు పేటలోని అహలే హదీస్ మసీదు, ఉమర్ ఏ ఫరూఖ్ మసీదు, మర్కజ్ ఈనామ్ మసీదు, జుమీరాత్ మసీదు, బీడీ కాలనీ మసీదు, ఇస్లాం పేట మసీదు, ఫాతిమా మసీదు, జిల్లా మసీదు, శనివారపు పేట మసీదు, దొండపాడు మసీదు, తంగెళ్లమూడిలోని నెహర్ మసీదు, రాణీ నగర్‌లోని పురానా మసీద్, నయా మసీదు, జామియా మసీదు, చౌక్ మసీదు, ఖురేషీ మసీదు, నాథూమియా మసీదు, మదీనా మసీదు, అక్కిలేట్ మసీదు, ఎంఎం కాలనీ మసీదు, మాదేపల్లి మసీదు, గేట్ మసీదు, మహ్మదీయ మసీదు, వైఎస్సార్ కాలనీ మసీదు, తబ్‌లిక్ జమాత్ మసీదు, నూర్ మసీదుల్లో విశేష ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

దేవునిపై విశ్వాసంతో జీవించాలి


ఏలూరు(ఆర్ఆర్‌పేట): కార్యక్రమంలో పాల్గొన్న ఫాదర్లు, గురువులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశ్వాసులు దేవుని పట్ల స్థిరమైన విశ్వాసంతో జీవించాలని అందుకు గురువులు కష్టపడి దేవుని సేవ, ప్రజా సేవ చేయాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర పిలుపునిచ్చారు. బిషప్ జయరావు గురు పట్టాభిషేక 33వ వార్షికోత్సవాల రెండో రోజు ప్రత్యేక కార్యక్రమాలు స్థానిక ప్రగతి నగర్‌లోని మోనాస్ట్రీ ఫాదర్ బేదంపూడి రాజు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేత్రాసన ప్రొక్యూరేటర్ ఫాదర్ రాజు మాట్లాడుతూ బిషప్ జయరావు తన సేవా జీవితంలో ఎన్నో అడ్డంకులు, ఇబ్బందులు ఎదురైనా విశ్వాస పటిమతో ప్రార్థనా జీవితంతో వాటిని జయించి సేవల్లో ముందుకు సాగారన్నారు. వికార్ జనరల్ ఫాదర్ పీ. బాల మాట్లాడుతూ బిషప్ జయరావు ఉత్తమ పరిపాలనా దక్షత కలవారని, ప్రేమతో సంఘాలను నడిపించారన్నారు. వరంగల్‌కు చెందిన బిషప్ కుటుంబ సభ్యులు రూపొందించిన పాటల సీడీని బిషప్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ స్టీవెన్ థామస్, ఫాదర్ ఐ.మైఖేల్, కార్పొరేటర్ నిర్మల, విశ్వాసులు పాల్గొన్నారు.

బిషప్ జయరావుకు సత్కారం

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు 34వ గురు పట్టాభిషేక మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ బిషప్‌ను కలిసి సమిష్టి కృషితో ఆయన కోస్తా జిల్లాల్లో ఆధ్యాత్మిక విద్య, వైద్యం, పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.